## క్లుప్తంగా

### ఇంటింటికీ మొక్కల పంపిణీ



దేవరకద్ర: పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతాంలో శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి అయిదు మొక్కలను అందజేశారు. వర్షాలు కురుస్తుండటంతో నాటిన ప్రతి మొక్క పెరిగే అవకాశం ఉండటంతో నర్సరీ నుంచి ట్రాక్టర్లలో తీసుకొచ్చిన తులసి, మందార, దానిమ్మ, జామ, నేరడు, ఇంకా వివిధ రకాల మొక్కలు పంపిణీ చేశారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతిఇంటి ముందు మొక్కలు పెంచాలని సూచించారు.

### పీయూలో పోస్టులు భర్తీ చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏబీవీపీ పీయూ నాయకులు జైపాల్ పేర్కొన్నారు. పీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్తిస్థాయిలో పోస్టులు భర్తీ చేయకపోవడంతో యూనివర్సిటీ కుంటుపడుతూ వస్తుందన్నారు. పీజీ సెంటర్‌లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు లేవని, ఎన్ని ఉద్యమాలు చేసినా.. ఎన్ని వినతులు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో వేణుగోపాల్, శశికుమార్, శివప్రసాద్, ఓం ప్రకాష్, రవి తదితరులు పాల్గొన్నారు.

### సీఎంను కలిసిన జేపీఎన్‌సీ కళాశాల చైర్మన్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. జేపీఎన్‌సీ కళాశాల చైర్మన్ రవికుమార్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్‌కు పలు సమస్యలు పరిష్కరించాలని కోరగా.. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

### ఎన్టీఆర్ కళాశాల సిబ్బందికి కమిషనర్ అభినందన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదా కల్పిస్తూ.. ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో విద్యాశాఖ కమిషనర్ దేవసేన కళాశాల సిబ్బందిని హైదరాబాద్‌లో శనివారం అభినందించారు. ఈ మేరకు కళాశాల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో జేడీలు యాదగిరి, రాజేందర్‌సింగ్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నాయకుల పరామర్శ



జడ్చర్ల టౌన్: బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్‌ను శనివారం సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ పరామర్శించారు. పదిరోజుల కిందట కృష్ణయాదవ్ తండ్రి నారాయణయాదవ్ మృతిచెందాడు. దశదిన కర్మ నిర్వహించగా.. జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ బూర్గుపల్లికి చేరుకుని పరామర్శించారు. పరామర్శించిన వారిలో బీసీ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నిరంజన్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్‌నాయక్, ఎమ్మార్పీఎస్ నాయకులు భీంరాజ్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

### వైద్యం అందక కాడెద్దు మృతి



మృతిచెందిన కాడెద్దు

రాజాపూర్: గ్రామీణ ప్రాంతాల్లోని పాడిగేదెలు, పశువులు, మేకలు గొర్రెలు తదితర మూగజీవాల కోసం గ్రామాల్లో గోపాలమిత్ర కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటి కోసం రూ.లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించారు. కాని గోపాలమిత్ర కేంద్రాల్లో సిబ్బంది లేక పశువులకు రోగమొస్తే చికిత్స చేసేవారు కరువయ్యారు. శనివారం రాజాపూర్ మండలంలోని ఈద్గాన్‌పల్లిలో శేఖర్ అనే రైతుకు చెందిన కాడెద్దు అనారోగ్యానికి గురైంది. ప్రైవేటు వ్యక్తులను తీసుకొచ్చి చికిత్స చేయించినా.. తన కాడెద్దు మృతిచెందింది. ఈ సమయంలోని ఒక్క కోడెద్దుతో కాడె ఎలా ముందుకు సాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో గోపాలమిత్ర ఉండి ఉంటే ప్రభుత్వ పశువైద్యశాల సిబ్బంది, తన కోడెకు సకాలంలో వైద్యం అందించి ఉంటే కాడెద్దు మృతిచెంది ఉండేది కాదని ఆవేదన వ్యక్తం చేశాడు.

# ఆరులైన్ల హైవే పనులు ప్రారంభం

- బాలానగర్‌లోజాతీయ 44 రహదారికి ఆనుకుని ఉన్న వ్యాపార సముదాయాల తొలగింపు
- ఇళ్లను తొలగించవద్దని రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్న వైనం



బాలానగర్ మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డులో జాతీయ రహదారికి ఇరువైపులా ఆక్రమించి నిర్మించిన ఇళ్లను తొలగించిన అధికారులు

రాజాపూర్: నాలుగులైన్ల జాతీయ రహదారి 44ను, ఆరులైన్ల జాతీయ రహదారిగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందు సంబంధించి సిక్స్ లైన్స్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. శనివారం బాలానగర్ మండల కేంద్రంలో జాతీయ రహదారికి పక్కల సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న వ్యాపార సముదాయాల ముందు భాగాన వారు నిర్మించుకున్న స్టెప్స్‌ను తొలగించాలని నేషనల్ హైవే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వ్యాపారస్తులు స్వయంగా స్టెప్స్‌ను తొలగిస్తున్నారు. కొందరు వ్యాపారులు గ్రామపంచాయతీ అనుమతులు ఉన్నదానికంటే, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వీస్ రోడ్డులో బాల్కానీలు ఏర్పాటు చేసుకున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి, వ్యాపార సముదాయాలు, ఇళ్లను నిర్మించుకున్నారు. నిబంధనల ప్రకారం అక్రమించిన స్థలాన్ని తొలగించాలని ఎన్‌హెచ్ శాఖల అధికారులు చెప్పేయడంతో బాలానగర్ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొందరైతే రాజకీయ నాయకుల వద్దకు వెళ్లి తమ వ్యాపార ఇళ్ల స్థలాలను కూలకుండా చూడాలని పైరవీలు ప్రారంభించారు.

**బాలానగర్ చౌరస్తాలో అండర్‌పాస్..**

బాలానగర్ ఎక్స్ రోడ్డులో గతంలో రెండు, మూడు పర్యాయాలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. మండల ప్రజలు ఆగ్రహానికి గురై డీసీఎంను తగలబెట్టిన సంఘటనలు ఉన్నాయి. బాలానగర్ మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డులో ప్రమాదాల నివారణకు అండర్‌పాస్ నిర్మాణానికి పనులు ప్రారంభం కావడంతో మండల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# మెస్‌చార్జీలు పెంచాలని నిరసన



హాస్టల్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు వెంటనే మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ.. బీఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల ఎస్సీ హాస్టల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. మెస్‌చార్జీలు రూ.2,500, కాస్మోటిక్ చార్జీలు రూ.250 చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే శిథిలావస్థకు చేరిన భవనాలకు మరమ్మతు చేయించాలని, అద్దె భవనాలు ఉన్నవాటికి సొంత భవనాలు నిర్మించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేసేందుకు పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరారు. రాజు, దాస్, తదితరులు పాల్గొన్నారు.

# పీర్లపండుగను శాంతియుతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీకాంత్

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన మొహర్రం పీర్లపండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత సామరస్యాలకు అతీతంగా పీర్లపండుగను హిందూ, ముస్లింలు కలిసి జరుపుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై.మహేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, రవీందర్, రాజ్‌కుమార్, ఖాజ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ లక్ష్యాలతో.. ఉన్నత జీవితం



అవగాహన కల్పిస్తున్న పోలీసు సురక్షా కళా బృందం సభ్యులు

**ఎంజేపీ బాలికల గురుకులంలో సురక్షా పోలీసు కళాబృందం**

హన్వాడ: ప్రతి విద్యార్థి ఉత్తమ లక్ష్యాలను నిర్దేశించుకుని చదువుకుంటే ఉన్నత జీవితానికి సోపానంగా మారనున్నట్లు సురక్షా పోలీసు కళాబృందం సభ్యులు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఎస్పీ జానకి ఆదేశాల మేరకు సురక్షా పోలీసు కళాబృందంతో బాలికలకు సామాజిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలబాలికలు చదువుపై దృష్టి సారించి క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత లక్ష్యాలను సాధించడం సులువని పోలీసు సురక్షా కళాబృందం సభ్యులు వివరించారు. దేశంలోని యువత స్వయం కృషితో అత్యున్నత స్థాయికి ఎదిగిన విషయాలను గుర్తించాలన్నారు. అలాంటి వారి స్ఫూర్తితో విద్యవైపుగా మన గ్రామీణ యువత దృష్టి సారించాలని, తల్లిదండ్రులకు, పుట్టిన ఊరుకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. చిన్న వయస్సులో ప్రేమ అంటూ, మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాల బారిన పడవద్దని, అలాంటి వాటి జోలిక వెళ్తే అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరన్నారు. అదేవిధంగా బాల్యవివాహాలతో వ్యక్తిగత అనర్థాలు జరగడమే కాకుండా, సమాజానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. బాల్యవివాహాలు నేరమని, అలా ఎవరైన చేస్తే.. చైల్డ్‌హెల్ప్ లైన్ 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్‌నేరగాళ్ల వలలో పడవద్దని, అనుకోని విధంగా ఎవరైన అకౌంట్‌లో నుంచి డబ్బులు పోగొట్టుకున్న వారు సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేయాలని సూచించారు. యువత సామాజిక మాధ్యమాలు, మొబైల్ ఫోన్లు, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, కష్టించి పనిచేయడంలోనే శక్తి సామర్థ్యాలు, గౌరవాలు, హోదాను పొందాలని సూచించారు. మాయమాటలు చెప్పి పిల్లలు, మహిళలు, యువతులను మానవ అక్రమ రవాణా చేసేవారిపై అప్రమత్తమై జాగ్రత్తగా ఉండాలన్నారు. అనుమానం ఉంటే సమీప పోలీస్‌స్టేషన్లలో లేదా 100కు డయల్ చేయాలని వివరించారు. జిల్లా ప్రజలు, ముఖ్యంగా యువత, బాలబాలికలు గొప్పగా ఎదగాలనే ఎస్పీ జానకి సందేశాన్ని సురక్షా పోలీసు బృందం, సభ్యులు ఈ సందర్భంగా వివరించారు. ఎంజేపీ ప్రిన్సిపాల్ స్పందన, ఏఎస్‌ఐ సాయిబాబ, కానిస్టేబుళ్లు శేఖర్‌గౌడ్, అశోక్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

### పీయూ వైస్‌ప్రిన్సిపాల్‌కు విద్యారత్న జాతీయ అవార్డు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ వైస్‌ప్రిన్సిపాల్ కృష్ణయ్యకు ఫిలాంత్రఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో భారతీయ లలిత కలోత్సవ్ విద్యారత్న జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం తెలుగు విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి అందించారు. ఈ మేరకు ఆయన కొన్ని సంవత్సరాలుగా తెలుగు భాషలో చేసిన సేవలను గుర్తించి, ఈ అవార్డును బహూకరించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరింత సేవ చేయాలని, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో చిలుముల బాల్‌రెడ్డి, అశ్రిత తదితరులు పాల్గొన్నారు.

### జాతీయస్థాయి కరాటే పోటీలకు జడ్చర్ల విద్యార్థులు



జడ్చర్ల టౌన్: కర్ణాటకలోని బళ్లారి జిల్లా, దేవనగారిలో ఆదివారం నిర్వహించనున్న జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు జడ్చర్ల వీబీపీ బ్లాక్‌బెల్ట్ ఆర్గనైజేషన్‌కు చెందిన నలుగురు ఎంపికైనట్లు మాస్టర్ సయ్యద్ అశ్ఫక్ తెలియజేశారు. ఎంపికైన వారిలో సుమీర్, సాయి, అఖిల్, అన్సారి ఉన్నారని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో రాణించి జడ్చర్లకు పేరు తీసుకురావాలన్నారు. ఎంపికైన విద్యార్థులను మాస్టర్ అశోక్ అభినందించారు.

### టీఎస్‌పీఎస్సీ ఫలితాల్లో ఫిజిక్స్‌లో ఆరో ర్యాంకు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలోని గాజులపేట్ పాఠశాల హెచ్‌ఎం గోపాలరాజ్ కుమారుడు ఈశ్వర్‌చంద్ర జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించాడు. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన ఫలితాలల్లో ఫిజిక్స్‌లో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు, జోన్–2లో 4వ ర్యాంకు సాధించాడు. ఈ మేరకు ఈశ్వర్‌చంద్ర 2020లో ఎన్ఐటీ సూరత్ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. ఈ సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరింతగా ఎదగాలని సూచించారు.

# నిబద్ధతతో విధులు నిర్వహించండి



ఉపాధ్యాయుల ఆత్మీయ వీడ్కోలు సభలో సన్మానిస్తున్న ఎంఈఓ మంజులాదేవి

జడ్చర్ల టౌన్: ఏ పాఠశాలలో పనిచేసినా ఇక్కడ చేసినట్లుగానే నిబద్ధతతో పనిచేసి ఆ పాఠశాలకు పేరు తీసుకురావాలని ఎంఈఓ మంజులాదేవి పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో మండలంలో పనిచేసి బదిలీ, పదోన్నతులపై ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సంబంధిత పాఠశాలలో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించటంతో పాటు వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. బదిలీపై జడ్చర్ల మండలానికి వచ్చిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు మీ వంతు పాత్ర పోషించాలని కోరారు. అంతకు ముందు ఏఎంఓ శ్రీనివాస్ సభలో పాల్గొని బదిలీ, పదోన్నతులపై వెళ్తున్న వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 60 మంది ఉపాధ్యాయులను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఎంఈఓ మంజులాదేవిని సత్కరించారు. కార్యక్రమంలో జగదీశ్, గోవింద్‌నాయక్, సునీల్, థాహెర్ తదితరులు పాల్గొన్నారు.

# సుభాష్‌నగర్‌లో చైర్మన్ పర్యటన



సుభాష్‌నగర్‌లో పెద్ద కాల్వను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 49వ వార్డు పరిధిలోని సుభాష్‌నగర్‌లో శనివారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. ముఖ్యంగా ఇళ్ల మధ్యలోని పెద్ద కాల్వను పరిశీలించి, ఎప్పటికప్పుడు మురుగుతో పాటు వరద ముందుకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. కాగా, కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థతో పాటు సీసీరోడ్లకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పుష్పవతి, స్థానిక నాయకుడు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి



సన్మానం పొందిన వ్యాపార సంఘం నాయకులు

మిడ్జిల్: మండల కేంద్రంలో ఇటీవల వ్యాపార సంఘం కమిటీని ఎంపిక చేశారు. ఆ కమిటీ శనివారం నిర్వహించిన సమావేశంలో ప్రమాణ స్వీకారం చేశారు. మండలంలో వ్యాపారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు గంజి కృష్ణ అన్నారు. సంఘంలోని సభ్యులకు ఏ ఆపద వచ్చినా.. సంఘం నుంచి సహకారం అందించాలని తీర్మానించారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ప్రతి నెల 2వ, 4వ శనివారాలు వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు బంద్ చేయాలని తీర్మానించారు. సమావేశంలో గౌరవ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, శేఖర్, రాజేశ్వర్, సింహయ్య, శ్రీనువాసులు తదితరులు పాల్గొన్నారు.

# బౌద్ధ కుటుంబాల సమ్మేళనం



సమ్మేళనంలో సందేశం ఇస్తున్న బౌద్ధ బిక్షువులు

స్టేషన్ మహబూబ్‌నగర్: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో బౌద్ధ కుటుంబాల సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యవక్తగా ప్రముఖ బౌద్ధ బిక్షువులు బంతెజి పాల్గొని బుద్ధ పూజ, త్రిచరణ, పంచశీల వితరణ చేశారు. అదే విధంగా బౌద్ధదమ్మ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర బీఎస్‌ఐ అధ్యక్షుడు పరంధాములు, డాక్టర్ వెంకటేశ్వర్లు, మహామాయ బుద్ధవిహార్ నిర్మాణ అధ్యక్షుడు ఆదిలక్ష్మయ్య, డాక్టర్ రామకృష్ణ, అరుణ, జ్యోతి, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు బ్రిడ్జి పనులు ప్రారంభం



వర్నె వాగులో కొనసాగుతున్న బ్రిడ్జి పనులు

అడ్డాకుల: మండలంలోని వర్నె వాగులో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చొరవతో ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. 2022 జూన్‌లో రూ.9 కోట్ల వ్యయంతో బ్రిడ్జి పనులు ప్రారంభం కాగా.. సగం పనులు కాగానే వాగుకు ఒకవైపు భూ సమస్య తలెత్తడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపేశాడు. తర్వాత గత ప్రభుత్వంలో అధికారులు భూ సమస్యపై పెద్దగా పట్టించుకోలేదు. ప్రభుత్వం మారడంతో ప్రస్తుత ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులతో సమీక్ష చేశారు. రైతు శేఖర్‌రెడ్డితో ఎమ్మెల్యే స్వయంగా మాట్లాడి నష్టపరిహారంతో పాటు మరోచోట కొంత భూమిని ఇప్పించేలా చర్యలు తీసుకుంటానని ఒప్పించడంతో పనులు చేసుకోవడానికి సదరు రైతు అంగీకరించాడు. దీంతో ఎట్టకేలకు శనివారం కాంట్రాక్టర్ బ్రిడ్జి పనులు తిరిగి ప్రారంభించాడు.

# హామీలు అమలు చేస్తాం..



అడ్డాకులలో చెక్కులను అందజేస్తున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

అడ్డాకుల: ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలన్నింటినీ తమ ప్రభుత్వం అమలు చేస్తుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. అడ్డాకుల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. వనపర్తి నియోజకవర్గ గ్రామాలైన చిన్నమునుగల్‌ఛేడ్, పెద్దమునుగల్‌ఛేడ్, కన్మనూర్ గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులు చెక్కులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడారు. దరఖాస్తుల సమయంలో అధికారులు, నాయకులు ఎవరైనా డబ్బులు అడిగారా అని లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఆరా తీశారు. ఆగస్టు 15 నాటికి రుణమాఫీ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, గంగుల విజయమోహన్‌రెడ్డి, వేఘనాథ్, బుచ్చన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గోరింటాకు వేడుకలు



గోరింటాకు వేడుకలు నిర్వహిస్తున్న మహిళలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు రెడ్డిసేవా సమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా శనివారం స్థానిక బీకేరెడ్డి కాలనీలోని బాలికల వసతిగృహంలో గోరింటాకు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షుడు మల్లు సరస్వతి, శోభ, వనజ, సునీత, శ్రీలత, అనిత, వరలక్ష్మి, శ్వేత, రమ, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం



నగదు బహుమతి అందజేస్తున్న నాయకులు

మిడ్జిల్: కేంద్ర ప్రభుత్వం మహిళల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఐద్వా రాష్ట్ర నాయకురాలు జ్యోతి అన్నారు. శనివారం మండల పరిధిలోని వాడ్యాల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఐద్వా జిల్లా మాజీ అధ్యక్షురాలు అరుణ 4వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అరుణ మహిళల కోసం చేసిన పోరాటం గురించి వివరించారు. ఆమె జ్ఞాపకంగా మండలంలో టాపర్లుగా నిలిచిన వారికి నగదు బహుమతి అందజేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు కిల్లెగోపాల్, రాములు, పద్మ, తిరుపతి, దిప్లానాయక్, కురుమూర్తి పాల్గొన్నారు.

# జూలపల్లికి నిలిచిన నీటి సరఫరా



జూలపల్లిలో వృథాగా ఉన్న మిషన్‌భగీరథ నీటి ట్యాంక్

మహమ్మదాబాద్: వర్షాలు తక్కువగా కురువడంతో అసలే బోరుబావుల్లో నీరులేక ఓ వైపు అవస్థలు పడుతుండగా.. మరోవైపు గ్రామాలకు తాగునీరు అందించే మిషన్‌భగీరథ తాగునీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో ఎక్కడా బోర్లలో నీరు లేకపోవడంతో వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. మండల పరిధిలోని జూలపల్లిలో 10 రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. దీంతో ప్రజలకు తాగునీరు లేకపోవడంతో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్తున్నారు. పలుమార్లు గ్రామస్తులు సంబంధిత మిషన్‌భగీరథ సిబ్బందిని అడిగితే పైనుంచే నీరు రావడంలేదని తెలియజేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై వాటర్ గ్రిడ్ ఏఈ అనిల్‌ను వివరణ కోరగా.. నాలుగైదు రోజుల నుంచి ప్రధాన పంపులు సరిగా నడవనందున నీటిసరఫరా సరిగా కావడంలేదన్నారు. పంప్‌లు ఆన్ కాగానే నీటిని వదులుతామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com